


## గల్లీకి ఢిల్లీ వట్టిగనే దిగొచ్చిందా..?



బీఆర్ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి కేసీఆర్ రచించిన వ్యూహాలు, అనుసరించిన ఎత్తుగడలు, నిష్ఠతో చేపట్టిన కఠోర కార్యసాధనతో తెలంగాణ గల్లీకి ఢిల్లీ దిగొచ్చింది. తెలంగాణ సాధన ఆవశ్యకతను కేసీఆర్, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వివరించగానే దేశంలోని జాతీయ, ప్రాంతీయ పార్టీలు లేఖలు ఇచ్చాయనుకోవటం భ్రమే అవుతుంది. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను ఒక్కొక్క నాయకుడికి, ఒక్కొక్క పార్టీకి వివరించేందుకు కేసీఆర్ పడ్డయాతన మామూలుది కాదు. గులాబీ జెండా ఎగిరిన మొదట్లోనే 2003 మార్చిలో హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వందలాదికార్లతో 'కారుర్యాలీ' చేపట్టడం, కరీంనగర్ సింహగర్జన సభకు జేఎంఎం అధినేత శిబు సోరెన్‌ను ఆహ్వానించటం దగ్గరినుంచి మొదలుకొని ప్రతీ బహిరంగసభకు, ప్రతీముఖ్యమైన కార్యక్రమానికి ఆయా పార్టీలకు చెందిన జాతీయ నేతలను అనేకమందిని పిలిచి వారికి తెలంగాణ ఆవశ్యకతను వివరించారు. ఢిల్లీకి వెళ్లడం మాత్రమే కాదు రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక సహా అనేక రాష్ట్రాలకు కాలికిబలపం కట్టుకొని తిరిగారు. దేవెగౌడ, శరద్‌పవార్, అజిత్‌జోగి, జార్జ్ ఫెర్నాండెజ్, రాంవిలాస్ పాశ్వాన్, మాయావతి, ఉమాభారతి సహా ఎంతోమంది నేతలను, స్వామి అగ్నివేశ్ లాంటి సామాజికవేత్తలను తెలంగాణ గడ్డకు రప్పించారు. అలాగే, సోనియా గాంధీ, మన్మోహన్‌సింగ్, సుష్మాస్వరాజ్, రాజ్‌నాథ్‌సింగ్ వంటి ఎంతోమందిని, ఆయా పార్టీల నేతలను వందల సంఖ్యలో కలిశారు. గల్లీలో పోరాటాలు... ఢిల్లీలో లాబీయింగ్‌కు మాత్రమే కేసీఆర్ పరిమితమైపోలేదు. అవసరమైన సందర్భాల్లో జంతర్‌మంతర్ దగ్గర జంగ్‌సైరన్ ఊదిన సందర్భాలు అనేకం. అంతేకాదు, న్యాయవాదులు, డాక్టర్లు, జర్నలిస్టులు సహా తెలంగాణ కోసం వివిధ వర్గాలు చేపట్టిన అనేక నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ వెన్నుదన్నుగా నిలిచింది.

పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. 2001, 2006, 2008, 2010, 2012 సాధారణంగా అయితే ఇవి సంవత్సరాలు కానీ తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రలో సువర్ణాధ్యాయాలు. ప్రపంచ చరిత్రలోనే ఏ నాయకుడూ.. ఏ పార్టీ ఇన్ని రాజీనామాలు చేయలేదు. పదవులను త్యజించడం, ప్రజల్లోకి వెళ్లి మరింత రాటుదేలడం రాజీనామాల వెనకున్న అపూర్వమైన వ్యూహం. ఇంకేముంది? పనైపోయిందని అనుకునేలోపే ఇంతింతై వటుడింతై విస్మయపర్చడం కేసీఆర్ అమ్ముల పొదిలో అమోఘమైన అస్త్రం. పడిపోయిందని ప్రచారం జరుగుతుండగానే ఉవ్వెత్తున ఎగసి ఉప్పెన సృష్టిస్తుంది గులాబీ జెండా. 2006 కరీంనగర్ ఉప ఎన్నిక సదా స్మరించుకునే ఎత్తుగడ. శత్రువులందర్నీ ఒక్కచోట ఓడించిన ఆ గెలుపు చిరస్మరణీయం. వాదానికి వెయ్యి ఏనుగుల బలం.

### తెలంగాణ ఒక్కటే భారతాన...

స్వతంత్ర భారతం ఏ ఉద్యమాన్నీ అనుమతించలేదు.. అంగీకరించనూ లేదు ఒక్క తెలంగాణ తప్ప. ఉద్యమాలు దేశ ఐక్యతకు సవాల్‌గా పరిణమిస్తాయని కేంద్రం భావించింది. 1950వ దశకం నుంచి 1970వ దశకం దాకా దేశంలో జరిగిన వివిధ ఉద్యమాలను అప్పటి ప్రభుత్వాలు అణచివేశాయి. పంజాబ్‌లో మిశ్రమపోరాటం ఫలితంగా హర్యానా, పంజాబ్‌ను ప్రత్యేక రాష్ట్రాలుగా విభజించారు. అయితే, ఇతర ఉద్యమాలు.. ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఉద్యమాలకు తెలంగాణ ఉద్యమానికి అసలు పోలికే లేదు. అతి సుదీర్ఘ కాలంగా సాగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని భారతదేశం చూసింది. చూస్తున్నది. సామాజిక కోణంలో ఆలోచించలేదనే వాదన బలంగా ఉంది. ఇక ఆదివాసీ, దళిత ఉద్యమాలనూ పూర్తిస్థాయిలో అనుమతించలేదు. అయితే, తమ తమ రాజకీయ అవసరాల రీత్యా రిజర్వేషన్ల కల్పన పేరుతో... మరోపేరుతో వాటిని కొంతమేరకు ఇన్‌బిల్ట్ చేసుకోగలిగింది. దేశంలో అన్ని ఉద్యమాలు హింసతో ముడిపడి ఉండటం వల్ల అవి తెలంగాణ ఉద్యమం



